# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఈ 5 సంవత్సరాల్లో 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- వైకుంఠ ఏకాదశి వేడుకలు ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా వైష్ణవ ఆలయాల్లో ఘనంగా జరిగాయి.
- గోకులాల ద్వారా చిన్న, కౌలు రైతులు బాగుపడతారని, భవిష్యత్ లో 20 వేల గోకులాలు ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ప్రకటించారు.
- భవన నిర్మాణాల కోసం సింగిల్ విండో విధానం అమల్లోకి తెస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు.
- ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ల పరీక్ష తేదీను ఏపీపీఎస్సీ (APPSC) ఈ రోజు ప్రకటించింది.

==========================

ఈ 5 సంవత్సరాల్లో 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య మైదానంలో నరెడ్కో ప్రాపర్టీ షోను ఈ రోజు ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ఇప్పుడిప్పుడే ముందుకెళ్తోందని, నిర్మాణ రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ రంగంపై 34 లక్షల మంది ఆధారపడి ఉన్నారని, ఉచిత ఇసుక విధానం తెచ్చి నిర్మాణ రంగానికి ఊతమిచ్చామని వెల్లడించారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ సాధన కోసం కృషి చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 4 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు సంతకాలు చేశామని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

==========================

గోకులాల ద్వారా చిన్న, కౌలు రైతులు, ఇతర వర్గాలు బాగుపడతాయని భవిష్యత్ లో 20 వేల గోకులాలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలో గోకులం షెడ్లను ఉపముఖ్యమంత్రి ఈ రోజు ప్రారంభించారు. అక్కడి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన 12 వేల 500 మినీ గోకులం షెడ్లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోవులు, గోకులాలను సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. శ్రమ ఉన్న చోటే పెట్టుబడులు వస్తాయని, రైతుల ఆదాయం రెట్టింపయ్యేలా ఆలోచనలు చేస్తున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

శ్రీకాకుళం జిల్లా శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో రానున్న రథసప్తమి వేడుకల సందర్భంగా సామాన్య భక్తుల దర్శనానికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆలయ అధికారులతో ఈ రోజు అరసవెల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయం వద్ద ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. వాహనాల పార్కింగ్, భక్తులు వెళ్లే దర్శనం మార్గాలు, బందోబస్తు, భద్రత, క్యూ లైన్ల మళ్లింపు, తీసుకోవలసిన చర్యలు, తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

==========================

నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టిందని జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి -(N.C.E.R.T) డైరెక్టర్ ప్రొఫెసర్ దినేష్ ప్రసాద్ సక్లానియా అన్నారు. నెల్లూరులోని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ప్రాంతీయ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఈరోజు దక్షిణాది రాష్ట్రాల ఉపాధ్యాయ శిక్షణ సంస్థల అధ్యాపకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సులో దినేష ప్రసాద్ మాట్లాడుతూ... నూతన విద్యా విధానాలను అధ్యాపకులు ఆకళింపు చేసుకుంటేనే క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు వీలవుతుందన్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ల పరీక్ష తేదీను ఏపీపీఎస్సీ (APPSC) ఈ రోజు ప్రకటించింది. 8 నోటిపికేష్లనకు సంబంధించి ఏప్రిల్‌లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించింది. ఏప్రిల్ 27 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణ ఉంటుందని తెలిపింది. అసిస్టెంట్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులకు, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, అసిస్టెంట్ కెమిస్టు, అసిస్టెంట్ ఎలిక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, ఏఎస్‌వో, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టులకు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేసింది. పూర్తి వివరాల కోసం portal-psc.ap.gov.in లో చూడాలని ఏపీపీఎస్సీ తెలిపింది.

విరామం

==========================

భవన నిర్మాణాల కోసం సింగిల్ విండో విధానం అమల్లోకి తెస్తున్నామని పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. విజయవాడలో క్రెడాయ్ విజయవాడ ప్రాపర్టీ షో ను ఈ రోజు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని, భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులను సులభతరం చేస్తూ.. జీవోలు జారీ చేశామన్నారు. 10 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సరళమైన నిబంధనలు రూపొందించామని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

==========================

రైతుల, పశుపోషకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా మద్దిపాడులో గోకులాన్ని ఈ రోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... పల్లె ప్రగతి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గోకులాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శివల గ్రామంలో మినీ గోకులాలను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. పశుపోషణ రైతుల కోసం 90 శాతం రాయితీపై మినీ గోకులాలను నిర్మిస్తున్నామన్నారు.

==========================

వైకుంఠ ఏకాదశి వేడుకలు ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా వైష్ణవ ఆలయాల్లో ఘనంగా జరిగాయి. పలు వైష్ణవాలయాలకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారికి ఏకాంతంగా కైంకర్యాలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఉదయం నాలుగున్నర గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పదంలో నడవాలని స్వామిని కోరుకున్నట్లు వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

శ్రీ వారిని దర్శించుకున్న ప్రముఖులలో తెలంగాణా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు, ఉప సభాపతి రఘురామ కృష్ణం రాజు, మంత్రులు వంగలపూడి అనిత, పార్థసారథి, సవిత, నిమ్మల రామానాయుడు, ఆధ్యాత్మిక గురువు రాందేవ్ బాబా తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా తొక్కిసలాట ఘటనలో గాయపడ్డ 52 మంది క్షతగాత్రులకు ప్రత్యేక వైకుంఠద్వార దర్శనాన్ని అధికారులు కల్పించారు. అదే విధంగా అన్నమయ్య జిల్లా రాయచోటిలోని 400 సంవత్సరాల కాలంనాటి శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

==========================

కోడి పందాలు నిర్వహించిన, పాల్గొన్న వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ రూపొందించిన కోడి పందాలు- చట్టరీత్యా నేరం నినాద గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కోడిపందాలు చట్టరీత్యా నేరమని, ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై సెక్షన్ 10 - ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ 1974, సెక్షన్ 34 - జంతు హింస నివారణ చట్టం, 1960 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు.

==========================

==========================